తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 19 - డిసెంబర్ 2025 | సంపుటి:3 | సంచిక:201 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in




## తెలంగాణ గ్రూప్-3 ఫలితాలు విడుదల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ గ్రూప్`3 అభ్యర్థుల ఫలితాలు గురువారం విడుదల య్యాయి. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్`3కి 1,370 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో జరిగిన గ్రూప్`3 పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డి స్టెనో, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్షకు సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.

మిగతా 2లో..

## పర్ఫెక్షనే కాదు... సిన్సియారిటీ కూడా అవసరం

పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్'

ప్రజాసేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అంతర్గత బలహీనతలే ప్రమాదకరం

యువ సివిల్ సర్వెంట్లకు మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం

2లో




## ఎన్నికల యంత్రాంగానికి సీఎం అభినందనలు



- మీడియా సమావేశంలో ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ అభిప్రాయం వెల్లడించిన ముఖ్యమంత్రి
- ప్రజా ప్రభుత్వానికి 66 శాతం గ్రామ పంచాయతీల్లో ప్రజల ఆశీర్వాదం – బాధ్యత మరింత పెరిగిందన్న సీఎం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలతో చర్చించి తదుపరి ఎన్నికలపై నిర్ణయం
- రేషన్ కార్డులు, రైతు భరోసా, రుణమాఫీ నుంచి మహిళా సంక్షేమ పథకాల వరకు విస్తృత కార్యక్రమాలు

2లో



## బెళగావి రైలు బోగీలో మంటలు

రైలును నిలిపి మంటలను ఆర్పిన సిబ్బంది

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు.

మిగతా 2లో..

## అధికారిగా కాదు..
# ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందాలి



మార్పు, గౌరవం తీసుకొస్తే మీరు విజయం సాధించినట్టే

నిజాయితీగా సేవ చేయండి ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి

సివిల్ సర్వీస్ అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

ప్రజలు మిమ్మల్నిఒక అధికారిగా మాత్రమే కాకుండా ప్రజా సేవకుడిగా గుర్తుపెట్టుకోవడం వల్లనే సివిల్ సర్వీసెస్ హోదాకు న్యాయం చేయగలిగిన వారుగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం లో ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ అధికారులు 10 వారాల శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసీఆర్‌హెఆర్డీ వైఎస్ ఛైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు మిమ్ములని మీరు ఒక ప్రశ్న వేసుకోండి.. మీ పని ద్వారా ఎవరి జీవితంలో అయినా ఒక మంచి మార్పు, గౌరవాన్ని తీసుకువచ్చిందా ప్రశ్నించుకోండి? అవును అని సమాధానం వస్తే.. ఆరోజు మీరు ఎంత కఠినపరిస్థితుల్లో విధి నిర్వహణ చేసినా.. మీరు విజయం సాధించినట్టేనని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.

మిగతా 2లో..

## గాంధీజీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

ఉపాధి హామీ పథకం పేరు మార్పు గాంధీజీని అవమానించినట్లే

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయనను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు.

మిగతా 2లో..



## బిఆర్ఎస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం పొందుతుంది


కెసిఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు:కేటిఆర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

మాజీ సిఎం కెసిఆర్ మళ్లీ అధికారంలోకి రావాలనే కోరిక ప్రజల్లో బాగా ఉందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన రెండేళ్లలోనే మళ్లీ ప్రజల ఆదరణ పొందుతుందని అన్నారు. యాదాద్రి భువనగిరి

మిగతా 2లో..

## దివ్యాంగుల కోసం టెక్నాలజీ



దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ

సంక్షేమం నుంచి సాధికారత దాకా

దివ్యాంగుల కోసం తెలంగాణ సరికొత్త మోడల్

దివ్యాంగులే భవిష్యత్ నిర్మాతలు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

సంక్షేమంతో పాటు దివ్యాంగులు స్వతంత్రంగా, గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌరవ సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల కోసం అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు కేవలం సహాయం పొందే వర్గం కాదని, అవకాశం ఇస్తే తమ కాళ్లపై తామే నిలబడి ఆత్మవిశ్వాసంతో జీవించగల సామర్థ్యం ఉన్న పౌరులని మంత్రి పేర్కొన్నారు. ఇదే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి స్పష్టమైన దృక్పథమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం పింఛన్లకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్, టెక్నాలజీ, స్వయం ఉపాధి అన్నీ కలిసేలా సమగ్ర విధానంతో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్లు సకాలంలో, ఎలాంటి అడ్డంకులు లేకుండా పేద దివ్యాంగుడి చేతికి చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే చదువుతున్న దివ్యాంగ విద్యార్థి ఎక్కడా ఆగిపోకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్ కాగితాల్లోనే కాకుండా వాస్తవంగా ఉద్యోగాల్లో కనిపించాలన్నదే సీఎం గారి స్పష్టమైన ఆదేశమని గుర్తు చేశారు.

మిగతా 2లో..

## విద్యారంగంలో ఎన్జీవోల జోక్యం ఆందోళనకరం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

టెట్ సమస్యపై కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి

28,29 తేదీల్లో జనగామలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు, విస్తృత సమావేశాలు.. గోడపత్రిక విడుదల




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):

విద్యారంగంలో ఎన్జీవోల పాత్ర గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోందని, పరోక్షంగా ప్రైవేటీకరణకు దారులు వేసే ప్రమాదం పొంచి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కానీ అందుకు బదులుగా ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏర్పాటు చేస్తున్న క్లాసులు నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పర్ఫెక్షనే కాదు... సిన్సియారిటీ కూడా అవసరం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

'ఈ దేశం మీ నుంచి కేవలం పర్ఫెక్షన్ మాత్రమే ఆశించడం లేదు... అంతకంటే ఎక్కువగా మీరు చేసే పనిలో సిన్సియారిటీని కూడా కోరుకుంటోంది' అని యువ సివిల్ సర్వెంట్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దిశా నిర్దేశం చేశారు. గురువారం జూబ్లీహిల్స్ లోని డా.ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్సిట్యూట్ ఆఫ్ తెలంగాణలో నిర్వహించిన 'స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ఫర్ ఏఐఎస్ సీసీఎస్ ఆఫీసర్స్ 2025' ముగింపు వేడుకలకు ఆయన విశిష్ఠ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధనలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే ఒక హ్యూమన్ రిలేషన్ అని అన్నారు. అధికారం, హోదా, ప్రోటోకాల్స్ అన్నీ తాత్కాలికమని.. ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమన్నారు. నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు. ప్రజా సేవలో బాహ్య ఒత్తిళ్ల కంటే అహంకారం, ఉదాసీనత, అవినీతి లాంటి అంతర్గత బలహీనతలే ప్రమాదకరమని హెచ్చరించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ స్వీయ నియంత్రణ పాటిస్తూనే... నిజాయితీ, వినమ్రత, ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పౌర సేవలు ప్రజల ముంగిటకు చేరాలంటే టెక్నాలజీ వినియోగం అత్యవసరమన్నారు. అయితే... ఆ సాంకేతికత ప్రజలకు చేరువగా ఉండాలి కానీ, వారిని భయపెట్టేలా ఉండొద్దన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్ గవర్నెన్స్' సాధ్యమవుతుందని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని యువ అధికారులకు సూచించారు.

# అధికారిగా కాదు.. ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందాలి

(మొదటి పేజీ తరువాయి)

నిజాయితీతో సేవ చేయండి.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి.. మానవత్వంతో వ్యవహరించండి.. నాయకత్వంతో ముందుకు సాగండి.. అని శిక్షణలో ఉన్న అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు.కఠినమైన శిక్షణా కార్యక్రమం ముగిసిపోయి.. బాధ్యత, వివేకం, విచక్షణ, ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త ఆరంభాన్ని అందిస్తోందని అన్నారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన 203 మంది అధికారులు ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇక్కడకు మీరంతా ఇంజినీర్లు, వైద్యులు, ఆర్థిక నిపుణులు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులుగా వచ్చారు... ఇక్కడనుంచి అత్యున్నత స్థాయి గుర్తింపు, గౌరవంతో బయటకు వెళుతున్నారు. మీ ప్రతిభకు అర్హతలకు అనేక అవకాశాలు మీ ముందున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ రోజు కేవలం ఆనందపడే కార్యక్రమం మాత్రమే కాదు. ఇక్కడనుంచి బాధ్యతలు, బదిలీలు, క్లిష్టమైన సమస్యలు, ప్రజలకు సంబంధించిన ఫైళ్లు, ఉంటాయి. మీరు సరైన సమయంలో స్పందించాల్సిన అంశాలు ఉంటాయి. విధి నిర్వహణలో మీరు నిర్లక్ష్యంతో తీసుకునే ఒక నిర్ణయం ఒకరి జీవితాన్ని ఏళ్లపాటు ప్రభావితం చేయగలదు.. అందువల్ల నిబద్ధతతో విధి నిర్వహణ చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

పాలనలో ఒత్తిడి, కఠినమైన సందర్భాలు, మానవీయతతో కూడిన నిర్ణయాలు, ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించే సందర్భాలు.. ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రశంశలు, విమర్శలు కూడా వస్తాయి. అన్నింటిని.. ప్రజల కోసమే అన్నభావనతో ముందుకు వెళ్లాలని ఆయన చెప్పారు. యువ సివిల్ సర్వెంట్స్ గా అడుగు పెడుతున్న ఈ సమయం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా అభివృద్ధిని సాధిస్తోంది. మీరు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ఈ సమయం వేగవంతమైన మార్పుల కాలం, టెక్నాలజీ పాలన రూపు రేఖలు మారుస్తోంది అన్నారు. సోషల్ మీడియా విజయాలను, తప్పిదాలను రెండిరటినీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాతావరణ, భౌగోళిక, రాజకీయ షాకులు ముందస్తు హెచ్చరిక లేకుండా వస్తున్నాయి అని డిప్యూటీ సీఎం వివరించారు.ప్రజలు మరింత సమాచారం కలిగి ఉన్నారు. అదేవిధంగా ప్రశ్నిస్తున్నారు.. కారణాల పట్ల చాలా అసహనంగా ఉన్నారన్నారు. మీరు నిరంతరం నేర్చుకోవాలి.. అవసరమైతే పాత విషయాలను వదలిపెట్టాలి. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలని శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. ఈ మారుతున్న ప్రపంచంలో మూడు అంశాలు మాత్రం ఎప్పటికీ మారకూడదన్నారు. చరిత్ర కరుణ ఇవి మృదువైన విలువలు కావు. ఒక అధికారి సంపాదించగలిగే అత్యంత కఠినమైన ఆస్తులు ఇవే, అదే సమయంలో కోల్పోవడం కూడా అత్యంత సులభమైనవే అన్నారు.ఉద్యోగం ప్రారంభ దశలో అధికారం అంటే ప్రాముఖ్యత అని పొరపాటు పడటం సులభం,దయచేసి ఇది గుర్తుంచుకోండన్నారు. అధికారాన్ని మీరు స్వంతం చేసుకోరు. మీరు దాన్ని నమ్మకంగా నిర్వహిస్తారు రాజ్యాంగం నుంచి, చట్టం నుంచి, చివరికి ప్రజల నుంచి. మీరు పౌరుల కంటే పైగా ఉంచబడలేదు. విధానం మరియు వాస్తవం మధ్య, రాష్ట్రం మరియు అత్యంత బలహీనమైన పౌరుడి మధ్య మీరు నిలబెట్టబడ్డారు అన్న వాస్తవాన్ని గుర్తించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. మీ విజయాన్ని మీరు జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్యతో కొలవరు. మీరు అక్కడ ఉండటం వల్ల ఎన్ని జీవితాలు నిశ్శబ్దంగా సులభమయ్యాయో దానితో కొలుస్తారు అని తెలిపారు. మీరు వేర్వేరు రాష్ట్రాల నుంచి, వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చారు. కొంతమంది తెలంగాణకు చెందినవారు, మరికొందరు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు. మీరు వేర్వేరు సేవలను, వేర్వేరు విభాగాలను ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. కానీ మీ అందరినీ కలిపే ఒక ప్రశ్న ఉంది. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు తప్పకుండా అడిగి ఉంటారు అని ఆసక్తిగా డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఈ వయసులో, ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్నప్పుడు కూడా, మీరు ఎందుకు ప్రభుత్వ సేవను ఎంచుకున్నారు? మీరు కార్పొరేట్ రంగంలోకి వెళ్లి సంపాదించవచ్చు కదా ? పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు కదా ? స్వంత వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు కదా? కానీ మీరు రాష్ట్ర వ్యవస్థలో పనిచేయాలని, ప్రజా కార్యక్రమాలను అమలు చేయాలని, మీ పేరు కూడా తెలియని పౌరులకు సేవ చేయాలని ఎంచుకున్నారు. ఆ ఎంపికకు విలువ ఉంది, అదే మీ వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుందని పేర్కొన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పుడు, మహాత్మా గాంధీని సలహా అడిగారు. అప్పుడు గాంధీజీ స్పందిస్తూ ఎప్పుడైనా సందేహం వచ్చినప్పుడు, మీరు చూసిన అత్యంత పేద, బలహీనమైన వ్యక్తిని గుర్తు చేసుకోండి. మీ నిర్ణయం ఆ వ్యక్తికి ఉపయోగపడుతుందా? అని మీరే మిమ్మలను ప్రశ్నించుకోండి. ఉపయోగపడితే అదే సరైన నిర్ణయంగా భావించండి గాంధీజీ నెహ్రూ కు సలహా ఇచ్చారని వివరించారు. ఆ సరళమైన పరీక్ష అనేక తరాలుగా ప్రజా సేవకులను మార్గనిర్దేశం చేసింది. అది ఈ రోజుకీ అంతే ప్రాధాన్యతతో ఉంది అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజాజీవితంలో మెల్లగా దారి తప్పడం చాలా సులభం. దూరంగా మారడం, బాధ్యత కంటే అధికారాన్ని ఎక్కువగా ఆస్వాదించడం అందులో భాగమే. మొదటిసారి సేవలో చేరినప్పుడు ఉన్న లక్ష్యాన్ని, అనుకోకుండా అయినా, మరిచిపోవడం జరుగుతుందని తెలిపారు. దీని నుంచి మిమ్ములను మీరే కాపాడుకోండి. సాధారణ ప్రజలతో ఎప్పుడూ సంబంధం కొనసాగించండి. గౌరవంతో కలవండి. ఓర్పుతో వినండి. పౌరులతో గడిపే సమయం పని నుంచి దూరం చేసే విషయం కాదు అన్నారు.అదే మీ పని యొక్క అసలైన ఉద్దేశ్యం కూడా అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఎయిర్ కండిషన్డ్ కార్యాలయంలో కూర్చుని ఫైళ్లను క్లియర్ చేయడం అవసరమే. కానీ అది మానవ సంబంధాలకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోండన్నారు. ఈ ప్రాంగణాన్ని మీరు జ్ఞానం, ఆత్మవిశ్వాసం, ఆశతో విడిచిపెడుతున్నారు. ఇకమీకు అవసరమయ్యేది వివేచన, వినయం, నైతిక ధైర్యం అని డిప్యూటీ సీఎం వివరించారు. మన సంస్థల భవిష్యత్తు ప్రసంగాల వల్ల లేదా విధానాల వల్ల మాత్రమే కాదు. మీరు ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల వల్ల, చాలాసార్లు నిశ్శబ్దంగా, గుర్తింపు లేకుండా, ఎవరూ చూడని సమయంలో తీసుకునే నిర్ణయాల వల్ల రూపుదిద్దుకుంటుంది అన్నారు. నిజాయితీతో సేవ చేయండి. ధైర్యంతో నిర్ణయాలు తీసుకోండి. సానుభూతితో నాయకత్వం వహించండి అని శిక్షణ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

# ఎన్నికల యంత్రాంగానికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దామోదర రాజనర్సింహ గారు, ధనసరి అనసూయ సీతక్క గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి గారు మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు.

రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేచ్ఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు.

"రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కుల గణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది" అని ముఖ్యమంత్రి గారు వివరించారు.

ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు.

కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసన సభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

# తెలంగాణ గ్రూప్3 ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కోర్టులో ఉన్న పెండిరగ్ కేసుల తుది తీర్పుకు లోబడి ఈ ఫలితాల ఎంపిక ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఒక్క ఖాళీని ప్రస్తుతం విత్‌హెల్డ్ లో ఉంచింది కమిషన్. తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే ఎంపికను రద్దు చేస్తామని కమిషన్ హెచ్చరించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్`3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

# దివ్యాంగుల కోసం టెక్నాలజీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ లక్ష్య సాధనలో టెక్నాలజీ ఆధారిత ఇన్నోవేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (%uGIa%) అనేక మంది యువ ఆవిష్కర్తలకు మార్గదర్శకత్వం చేస్తూ వారి ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చడంలో ముందుండి పనిచేస్తోందని మంత్రి ప్రశంసించారు. మద్దతుతో ఎదిగిన వంటి సంస్థలు దివ్యాంగుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొచ్చే ఉత్పత్తులను రూపొందించడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో రూపొందించిన '' అసిస్టివ్ టెక్ పరికరాలను 20 మందికి పైగా దృష్టిలోపం ఉన్న వ్యక్తులకు గౌరవ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఉద్యోగాలు చేస్తున్న దివ్యాంగులు ఎవరి మీద ఆధారపడకుండా తమ వృత్తి గౌరవాన్ని కాపాడుకునేలా ఈ టెక్నాలజీలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. ఇది కేవలం వ్యాపారం కాదని, సామాజిక బాధ్యతతో కూడిన ఇన్నోవేషన్ అని పేర్కొన్నారు. వంటి సంస్థలు ముందుకు వచ్చినట్లే మరిన్ని కార్పొరేట్ సంస్థలు ద్వారా దివ్యాంగుల సాధికారతకు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ద్వారా వచ్చే నిధులు దివ్యాంగుల సంక్షేమానికి మాత్రమే కాకుండా వారి స్వయం ఆధారిత జీవనంలో పెట్టుబడిగా మారాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్టార్టప్ భాగస్వామ్యంతో దివ్యాంగుల కోసం ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని భారతదేశంలో తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించడం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు.

కేవలం 21 ఏళ్ల వయసులోనే వ్యవస్థాపకుడు రవి కిరణ్ ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన సాధించిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణ వాసికి గర్వకారణమని మంత్రి తెలిపారు. మద్దతుతో ఎదిగిన ఇన్నోవేటర్‌గా రవి దృష్టిలోపం ఉన్నవారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తూ, తెలంగాణను మరింత అందుబాటులో ఉండే రాష్ట్రంగా మార్చాలన్న స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సీఈఓ మిరాజ్, యునిసెఫ్ (ఆంధ్రప్రదేశ్ తెలంగాణ) ఫీల్డ్ ఆఫీసర్ జెలామియాలి, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ప్రతినిధి ప్రదీప్‌తో పాటు నెట్‌వర్క్ మోడల్‌పై పనిచేస్తున్న పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాంధీజీ పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఎ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథకాన్నితీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బిజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లుపొడుస్తూ నీరుగారుస్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్యబట్టారు. ఈ రోజు పార్లమెంట్‌లో తీసుకువచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భారమని అన్నారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' ఇప్పుడు 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం యొక్క స్వభావాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చివేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూపీఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చుకోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# విద్యారంగంలో ఎన్జీవోల జోక్యం ఆందోళనకరం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులను స్వేచ్ఛగా పాఠాలు చెప్పనివ్వండి. బోధనేతర పనుల భారం నుండి విముక్తులను చేయండి. ఆన్లైన్ నివేదికలు పంపడానికి బోధనేతర సిబ్బందిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రంలో 45 వేలమంది, దేశవ్యాప్తంగా 25 లక్షల మందిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్న టెట్ పై సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఉపాధ్యాయ సంఘాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవుతున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.గురువారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో చావ రవి, ఎ వెంకట్ మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలు డిసెంబర్ 28,29 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో కామ్రేడ్ సయ్యద్ జియావుద్దీన్ ప్రాంగణం, కామ్రేడ్ రావెళ్ళ రాఘవయ్య వేదిక (మాంగళ్య ఫంక్షన్ హాల్) లో జరగనున్నాయని, సంబంధిత గోడపత్రికలను, ఆహ్వానాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు కార్యక్రమాల వివరాలు వెల్లడిరచారు. ఆదివారం (డిసెంబర్ 28) ఉదయం 9.30 లకు పట్టణంలో ఉపాధ్యాయుల మహాప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం జరిగే ప్రారంభ సభలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, సీతక్క అనసూయ ధనసరి గారు, కొండా సురేఖ గారు పాల్గొంటారు. పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి తదితరులు పాల్గొంటారు. మధ్యాహ్నం జరిగే విద్యా సదస్సుకు పాఠశాల విద్యా డైరెక్టర్ ఇ నవీన్ నికోలస్ గారు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ప్రొ. కె నాగేశ్వర్ ప్రొ మాడభూషి శ్రీధరాచార్యులు, అలుగుబెల్లి నర్సిరెడ్డి వక్తలుగా వివిధ అంశాలపై మాట్లాడతారు. సాయంత్రం జరిగే రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య ప్రారంభిస్తారు. మరుసటి రోజు జరిగే సమావేశంలో విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి, ఉపాధ్యాయుల సమస్యలను సమీక్షించి తగిన కార్యాచరణను సమావేశాల్లో రూపొందించుకుంటామని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ సింహాచలం, ఎం వెంకటప్ప, కొండలరావు, సీనియర్ నాయకులు డి మస్తాన్ రావు, సిహెచ్ వి రాజన్ బాబు, వెంకటేశ్వర్లు, రమేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం పొందుతుంది

(మొదటి పేజీ తరువాయి)

యాదాద్రి భువనగిరి జిల్లాలో కెటిఆర్ పర్యటన చేశారు. భువనగిరి బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం జరిగింది. కొత్త సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను కెటిఆర్ అభినందించారు. ఈ సందర్భంగా భువనగిరి లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 151 సర్పంచ్ స్థానాలను బిఆర్ఎస్ గెలుచుకోవడం విశేషమని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవం పొందుతుందని, ఎంపిగా గెలవటం కంటే సర్పంచ్‌గా గెలవటం కష్టం అని అంటారని.. అది నిజం అని పేర్కొన్నారు. గ్రామాల్లో బిఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని కెటిఆర్ మండిపడ్డారు.

# బెళగావి రైలు బోగీలో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ · తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 19 - డిసెంబర్ 2025



# వనపర్తి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నా






**వనపర్తి,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా నిర్వహించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ ప్రభుత్వం దురుద్దేశంతో నమోదు చేసిన నేషనల్ హెరాల్డ్ కేసును న్యాయస్థానం కొట్టివేయడాన్ని స్వాగతిస్తూ ఈ నిరసన చేపట్టారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు రాజీవ్ చౌక్ నుండి బీజేపీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, వనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మెగా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనారెడ్డి పాల్గొని బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు భారీగా గెలుపొందడం ప్రజా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. గెలుపొందిన నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా చాలా పత్రికలు వార్తలు రాసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ప్రచురించిన నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం కొంతకాలానికి ఆ పత్రిక మూతపడిందని, ప్రస్తుతం యంగ్ ఇండియా లిమిటెడ్ సంస్థ యంగ్ ఇండియా పీపుల్స్ పేరుతో మళ్లీ పత్రిక ప్రారంభించిందన్నారు.నేషనల్ హెరాల్డ్ పేరుతో ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా సుబ్రహ్మణ్యం స్వామి దురుద్దేశంతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కేసు పెట్టారని, అయితే ఢిల్లీ హైకోర్టు ఈ నెల 16వ తేదీన ఎఫ్ఐఆర్ లేకుండా కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేసిందన్నారు.నరేంద్ర మోదీ, అమిత్ షా ప్రభుత్వ కుట్రలకు భయపడే వారు కాదని, సోనియా గాంధీ పులిలా, రాహుల్ గాంధీ సింహంలా పోరాడుతున్నారని వ్యాఖ్యానించారు. గాంధీ కుటుంబంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ నాయకులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెప్పి, రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాష్ట్ర మైనారిటీ నాయకుడు అక్తర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి






**ధర్మసాగర్,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):**ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ హనుమకొండ, లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, తెలుగు-ఆంగ్ల నిఘంటువులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు కిరణ్మయ కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ బాధ్యులు రమణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి విద్యా సహాయ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ప్రగతికి తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, సురేష్, రామకృష్ణ, రమ్యశ్రీ పాల్గొన్నారు.

# నూతనంగా ఎన్నికైన అయ్యవారిపల్లె, పెద్ద మునగల్ షెడ్ సర్పంచులకు ఘన సన్మానం


రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నియోజకవర్గం లోని అయ్యవారిపల్లె, పెద్ద మునగల్ షెడ్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా కురుమూర్తి, చిట్టిబాబు ఘన విజయం సాధించిన సందర్భంగా.. వారు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మరియు వార్డు సభ్యులను డా. చిన్నారెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజల మద్దతుతో లభించిన విజయం కేవలం ఒక పదవి మాత్రమే కాదని, ప్రజలు అప్పగించిన గొప్ప బాధ్యత అని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు మీపై ఉంచిన విశ్వాసాన్ని ఎప్పటికీ వమ్ము చేయకుండా, ప్రతి గడపకు అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా అంకితభావంతో పని చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, ఉపసర్పంచ్ తారక వెంకన్న యాదవ్, ఆనంద్ సాగర్, వెంకటరత్నం, మన్యం సాగర్, చంద్రశేఖర్, కోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన సర్పంచ్ కిలారు మనోహర్ బాబు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండల కేంద్రంలోని బి సి కాలనీలో గురువారం నాడు జరిగిన నకన బోయిన రాంబాబు దంపతుల పిల్లల వోణీల వేడుక కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు. ఈ కార్యక్రమంలో కోల నాగేశ్వరావు,రహమతుల్లా,చింతల సైదులు,కొలిపాక మురళి, వెంకట్ మరియు తదితరులు పాల్గొన్నారు

# గులాబీ జెండాను ప్రజలు గుండెలకు హత్తుకున్నారు



- **ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంచాయితీలు నిర్వీర్యం**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం పంచాయితీ ఎన్నికలను కావాలనే ఆలస్యం చేయడం వల్ల గ్రామ పంచాయితీలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.ప్రభుత్వ పనితీరు సమర్థంగా ఉంటే ప్రజలు బ్రహ్మరథం పట్టేవారని, కానీ నేటి పరిస్థితుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసహనం, అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పారని ఆయన అన్నారు.ఈ ఎన్నికలు పార్టీపరంగా జరగకపోయినా, గులాబీ జెండా, కేసీఆర్ చిత్రపటం, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కనిపిస్తే చాలు ప్రజలు గుండెలకు హత్తుకున్నారని తెలిపారు. దీన్నిబట్టి ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న అసంతృప్తి స్పష్టంగా వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు.బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు ఇచ్చిన అపూర్వ మద్దతు చూస్తే, ఈ ప్రభుత్వం పతనం అంచులో ఉందని అర్థమవుతోందని, అందుకే బీఆర్ఎస్ విజయ దుందుభి మోగించిందని వ్యాఖ్యానించారు.అధికార పార్టీ ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు, ప్రలోభాలు, మాయమాటలకు పాల్పడినా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. బీఆర్ఎస్ ఎక్కడుంది? పార్టీని బొంద పెట్టినం అని వ్యాఖ్యానించిన వారికి ఈ విజయం చెంపపెట్టులాంటిదని ఘాటుగా విమర్శించారు.ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి గుణపాఠమని వ్యాఖ్యానిస్తూ, ఇంతటి విజయాన్ని అందించిన ప్రజలకు, కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేశారు.

# మృతుని కుటుంబానికి మేఘన్న అభయ హస్తం



**పెద్దమందడి,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పానుగంటి హనుమంతు (తండ్రి: పెద్ద సాయన్న) బుధవారం రాత్రి 7 గంటలకు గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5,000/ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధయ్య తిక్కన్న, మాజీ ఎంపీటీసీ ఇందిరా లక్ష్మారెడ్డి, మధిర శ్రీశైలం, వార్డు సభ్యులు శంకర్, కృష్ణ, నరేష్, భాస్కర్, వెంకటయ్య, మన్యపు రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పీచరలో కూరగాయల మార్కెట్‌కు స్థల పరిశీలన



- **కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ప్రజల విజ్ఞప్తి**

**వేలేరు,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మరిజె అనిత నర్సింహారావు తన ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందనే అంశంపై గ్రామస్తులతో చర్చించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వానికి చెందిన స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా డబ్బాలు ఏర్పాటు చేసి కబ్జా చేసిన విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని, అక్రమ కబ్జాలను తొలగించి ప్రజాప్రయోజనాలకు వినియోగంలోకి తేవాలని వారు కోరారు.

దీనిపై స్పందించిన సర్పంచ్, కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఉపయోగపడే విధంగా వీలైనంత త్వరగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిజె నర్సింహారావు, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మారబోయిన రాజు, కొయ్యడా మహేందర్, ఎమ్‌డీ హరీఫ్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఖమ్మంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

- సర్దార్ పటేల్ స్టేడియంలో 27, 28 లలో డే అండ్ నైట్ మ్యాచులు
- సర్దార్ పటేల్ స్టేడియం బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ అసోసియేషన్ అండ్ టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ రాధాకృష్ణమూర్తి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో డిసెంబర్ 27, 28 తేదీలలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలను విజయవంతం చేయాలని సర్దార్ పటేల్ స్టేడియం బాల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ అసోసియేషన్, టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ రాధాకృష్ణమూర్తి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... బాల్ బాడ్మింటన్ లెజెండర్ ప్లేయర్ అండ్ కోచ్ పులి రామస్వామి మెమోరియల్ ఆధ్వర్యంలో, ఖమ్మం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు బిబిఎఫ్ఐ అండ్ రెగ్యులేషన్స్ ప్రకారం డిసెంబర్ 27, 28 (శని, ఆదివారం)లలో స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో డే అండ్ నైట్ మ్యాచ్ లను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి అన్నారు. మ్యాచ్ లు లీగ్ అండ్ సూపర్ లీగ్ తరహాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. టీముల నమోదుకు డిసెంబర్ 20 చివరి తేదీ అన్నారు. ప్రతి మ్యాచ్ కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 30 వేలు, 2వ బహుమతి రూ.25వేలు, 3వ బాహుమతి రూ.20వేలు, 4వ బహుమతి రూ. 15వేలు, 5వ బహుమతి రూ. 10వేలతో పాటు మెమొంటోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అభిమానులు, క్రీడాకారులు టోర్నమెంట్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కోకన్వీనర్ టి రామచంద్రరాజు, కోఆర్డినేటర్ విజయ్ కలాం, ఇంచార్జ్ డాక్టర్ పులి మధు, ట్రెజరర్ మణిభూషణ చారి, అడ్వైజర్లు శంకరమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ తిరుపతిరెడ్డి, ఆర్గనైజింగ్ మెంబర్స్ బద్రి శ్రీకాంత్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీనే బలంగా ఉంది

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఇటీవల నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు స్పష్టంగా నిరూపించాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం నంది హిల్స్‌లోని తన నివాస కార్యాలయంలో పెబ్బేరు, శ్రీరంగాపురం, అడ్డాకుల మండలాల్లో మూడో విడతలో నిర్వహించిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరు ఎన్ని ఎత్తుగడలు వేసినా, నీచ రాజకీయాలు చేసినా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులతో పాటు, కాంగ్రెస్ పార్టీ తరపున స్వతంత్రులుగా (రెబల్స్‌గా) నిలబడిన అభ్యర్థులకు సైతం అధిక సంఖ్యలో ఓట్లు పడటం ద్వారా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందని పేర్కొన్నారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, గ్రామాభివృద్ధికి కృషి చేసిన సర్పంచులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ, విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు, వసతి గృహాల్లో మెరుగైన భోజన వసతులు, మెరుగైన వైద్య సదుపాయాలు, ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంపు, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రుణమాఫీ వంటి అనేక పథకాల ద్వారా గ్రామాల్లోని పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని తెలిపారు.ప్రస్తుతం విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని, ప్రతి ఒక్కరికీ తాను అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో అకాల మరణం పొందిన వెంకటాపురం ఎంపీడీవో రాజేంద్రప్రసాద్

- సంతాపం వ్యక్తం చేసిన జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాలు



**ములుగు,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):**ములుగు జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో భాగంగా విధి నిర్వహణలో ఉన్న వెంకటాపురం (ఎన్) మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సహాయ జిల్లా ఎన్నికల అధికారి రాజేంద్రప్రసాద్ గుండె పోటుతో అకాల మరణం చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. విధి నిర్వహణ సమయంలో గుండెపోటు రావడంతో జిల్లా అధికారులు వెంటనే స్థానికంగా వైద్యం అందించినప్పటికీ, పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు.

ఈ సంఘటన పట్ల ములుగు జిల్లా అధికారులు, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఘన నివాళులు అర్పించారు. ములుగు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు సంపత్ రావు మాట్లాడుతూ, జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న మండలంలో ఎన్నికల విధులను నిబద్ధతతో సమర్థవంతంగా నిర్వహిస్తూ చివరి రోజున అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని తెలిపారు. రాజేంద్రప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వపరంగా రావలసిన అన్ని ప్రయోజనాలు వీలైనంత త్వరగా అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ములుగు జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ కన్వీనర్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మడుగూరీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత 35 సంవత్సరాలుగా పంచాయతీ రాజ్ శాఖలో విధులు నిర్వహించిన రాజేంద్రప్రసాద్ ఎన్నికల విధుల్లో ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం (ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 7, తేదీ 22012022) రావలసిన ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు బర్మావత్ శ్రీనివాస్ ఆకస్మిక సంఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ, రాజేంద్రప్రసాద్ కుటుంబానికి సంఘం తరపున అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తుల రవి కూడా ఈ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం తెలిపారు.

ములుగు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సంతాప కార్యక్రమంలో సీనియర్ గెజిటెడ్ అధికారి శ్రీధర్ రాజు, జిల్లా పరిషత్ పర్యవేక్షకులు రాజేందర్, ఎస్సీ ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనగాం బాబురావు, ఇరిగేషన్ పర్యవేక్షకులు రాజ్‌కుమార్, మిషన్ భగీరథ ఉద్యోగులు రాజేశ్వర్, కిరణ్, కలాలి మొగిలి, జిల్లా పరిషత్ ఉద్యోగులు వి నాయక్, ఇందిరా ప్రియదర్శిని, జయ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20న తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ భేటీ

**హన్మకొండ,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండలో ఈ నెల 20న తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రెస్‌మీట్, సెమినార్‌కు ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని జేఏసీ నాయకులు పెండ్యాల సుమన్ పిలుపునిచ్చారు. హన్మకొండలోని హరిత కాకతీయ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం నిరంతరం ఉద్యమాలు చేసి, ప్రజల్లో చైతన్యం నింపిన ఉద్యమకారుల త్యాగాల ఫలితంగానే రాష్ట్రం ఏర్పడిందని సుమన్ అన్నారు. అయితే రాష్ట్రం సాధించినప్పటికీ పేద ప్రజలకు, ఉద్యమకారులకు, సామాన్య ప్రజానీకానికి ఆశించిన ఫలితాలు అందడం లేదని స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం సాగిన ఉద్యమంలో అనేక మంది ఉద్యమకారులు శారీరకంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలంతా భాగస్వాములై సాధించుకున్న స్వరాష్ట్రంలో ఇప్పుడు పెద్ద నాయకులు, ఉన్నతాధికారులు, ఆర్థిక బలమైన రాజకీయ వర్గాలు చొరబడి రాష్ట్రాన్ని దోచుకుంటున్న పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమకారులు, సామాన్య ప్రజలను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఉద్యమ కాలంలో కేసుల పాలై జైళ్లకు వెళ్లిన అనేక మంది ఉద్యమకారులు ఇప్పటికీ కేసుల వెంట తిరుగుతున్నారని, ఆమరణ, రిలే నిరాహార దీక్షలు చేసి ఆరోగ్యం కోల్పోయిన వారు నేటికీ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు.



ఆర్థికంగా పూర్తిగా నష్టపోయి రోడ్డున పడ్డ ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకునే నాయకత్వం రాష్ట్రంలో కనబడడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలలో ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చేసిన హామీలు అమలుకాకుండా మిగిలిపోతున్నాయని పేర్కొన్నారు. అందుకే సామాన్య ప్రజల అభివృద్ధి, సామాజిక తెలంగాణ నిర్మాణం, వేలాది మంది ఉద్యమకారుల సంక్షేమం కోసం మరో ఉద్యమం అవసరమైందని అన్నారు.ఈ నేపథ్యంలో ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో హన్మకొండలో ఉద్యమకారుల సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యమకారుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని సాధించుకునేందుకు ఈ సెమినార్ వేదిక అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి సహా రాష్ట్ర నాయకత్వం హాజరవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెండ్యాల సుమన్ పిలుపునిచ్చారు.

# కడియం శ్రీహరి రాజకీయ వైఖరిపై కాంగ్రెస్ నేతల విమర్శలు



**స్టేషన్ ఘనపూర్,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి రాజకీయ ప్రవర్తనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పూటకో పార్టీ మారుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు.

చిల్పూర్ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగంటి మణి మాట్లాడుతూ, కాంగ్రెస్ కండువా ధరించి బహిరంగంగా తిరుగుతూ మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానని చెప్పుకోవడం రాజకీయ అస్పష్టతకు నిదర్శనమన్నారు. 2023లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కడియం శ్రీహరి, ఆ తరువాత తన కూతురు రాజకీయ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీలో చేరి, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను నిరాశపరిచారని విమర్శించారు.

స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పునరుజ్జీవింపజేయడానికి కృషి చేసిన సింగపురం ఇందిరను సైతం మోసం చేశారని ఆరోపించారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన పాత కార్యకర్తలను పక్కనబెట్టి, పార్టీ మారి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.

ఇప్పటికీ తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతున్న కడియం శ్రీహరి, ప్రచారంలో ఏ పార్టీ కండువా ధరించి తిరుగుతున్నాడో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ నైతికత ఉంటే పదవికి రాజీనామా చేసి నియోజకవర్గంలో తిరగాలని సూచించారు.

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసిన కడియం శ్రీహరి, ఇప్పుడు మరో విధంగా మాట్లాడటం ఆయన రాజకీయ వైఖరిని వెల్లడిస్తోందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పి, ఏడాదిగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఉన్న వ్యక్తి ఇప్పుడు వారి ముందుకు ఎలా వెళ్లగలడని ప్రశ్నించారు.

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోకపోతే, స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని వారు హెచ్చరించారు.

# మీడియా పట్ల వివక్ష సరికాదు



- సమస్యలపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలి
- డి.పి.ఆర్.ఓ ఎమ్.ఏ.గౌస్ కు టిడబ్ల్యూజెఫ్ (హెచ్-2843) ఖమ్మం జిల్లా అధ్యక్షులు టీ.ఎస్. చక్రవర్తి వినతి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** మీడియాను నిర్లక్ష్యం చేయరాదని, అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు సకాలంలో మంజూరు చేయాలని, గతంలో అక్రిడిటేషన్ పొందినవారికి రెన్యూవల్ ప్రక్రియను సులభతరం చేయాలని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్ - హెచ్2843) ఖమ్మం జిల్లా అధ్యక్షులు టి.ఎస్.చక్రవర్తి కోరారు. ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, టి.డబ్ల్యూ.జె.ఎఫ్ (హెచ్2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎమ్.ఏ.గౌస్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వం-ప్రజల మధ్య కీలక వారధిగా పని చేస్తున్నారని తెలిపారు. అయితే అక్రిడిటేషన్, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రకటనల విషయంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రకటనల జారీలో చిన్న, మధ్య, పెద్ద పత్రికల మధ్య ఎలాంటి భేదభావం చూపకూడదని స్పష్టం చేశారు. అలాగే చిన్న, మధ్యస్థాయి పత్రికలకు, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రకటన బిల్లులను వెంటనే చెల్లించాలని, డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు పూర్తిస్థాయిలో అమలు చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, భరోసా చర్యలు అమలయ్యేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గతంలో దరఖాస్తు చేసుకుని, పెండింగ్‌లో ఉన్న ఇండిపెండెంట్ జర్నలిస్టుల సైట్‌ను రీ-ఓపెన్ చేసి, సీనియారిటీ నష్టపోతున్న అర్హత కలిగిన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కమిటీతో సంబంధం లేకుండా ఇండిపెండెంట్ జర్నలిస్టు కార్డులు మంజూరు చేయాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇకనైనా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలకు సిద్ధం కావాల్సి వస్తుందని టిడబ్ల్యూజెఎఫ్ హెచ్చరించింది. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి ఎమ్.ఏ. గౌస్ సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ ఖమ్మం జిల్లా సెక్రటరీ నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నాగేష్, జిల్లా ఉపాధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, వేల్పుల నాగేశ్వర రావు, టీ.బీ.జే.ఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, కార్యవర్గ సభ్యులు అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కందరబోయిన నాగకృష్ణ, మామిడాల కిరణ్, పొదిలాపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ





**ఖమ్మం బ్యూరో డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యడవల్లి రామిరెడ్డి మృతదేహాన్ని ఖమ్మం నగరంలోని మమత హాస్పిటల్‌లో గురువారం సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం పాలేరు నియోజకవర్గంలోని వారి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు తెలిపారు.

అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కరుణగిరి ప్రాంతంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్ తండ్రి ఏనుగు రాములు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని మంత్రి పొంగులేటి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

# శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి





- హతీరామ్ బావాజీ మఠానికి ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలి
- కేంద్రాన్ని కోరిన ఎంపీల బృందం

**న్యూ ఢిల్లీ,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభ భవనంలో కేంద్ర సంస్కృతి శాఖ మంత్రిని కలసి వినతిపత్రం సమర్పించిన అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆచార్య అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్, జీ నాగేష్ పార్లమెంట్ సభ్యులతో కలిసి శ్రీ హతీరామ్ బావాజీ మఠానికి ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. మఠానికి స్పష్టమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడితే సంప్రదాయాల పరిరక్షణతో పాటు భక్తుల విశ్వాసానికి భరోసా కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారిక జయంతిగా ప్రకటించి దేశవ్యాప్తంగా నిర్వహించాలని వినతిపత్రంలో డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. ఈ జయంతి అధికారికంగా నిర్వహించటం ద్వారా ఆయన సేవలు, బోధనలు దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రజలకు చేరువవుతాయని తెలిపారు. ఈ రెండు అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# కామ్రేడ్ భూక్య వీరస్వామికి ఘన నివాళులు..

**సీపీఐ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్ మౌలానా సంతాపం**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమైన యోధుడు, ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం పోరాడిన కామ్రేడ్ భూక్య వీరస్వామి మరణం పట్ల సీపీఐ కంట్రోల్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్ మౌలానా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. భూక్య వీరస్వామి ప్రజల మధ్య మన్నలు పొందిన మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారని, పేదలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేశారని మౌలానా గుర్తుచేశారు. ప్రజల కోసం, ప్రజల మధ్యనే జీవిస్తూ ప్రజా ఉద్యమాలకు బలమైన స్వరంగా నిలిచిన నాయకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు.సామాజిక సేవతో పాటు క్రీడారంగానికీ ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందించి యువతకు దిశానిర్దేశం చేసిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు.కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆదర్శంగా నిలిచిన కుటుంబం భూక్య వీరస్వామిదని, ఆయన నలుగురు అన్నదమ్ములతో కలిసి చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగుతూ ఉద్యమానికి అంకితమయ్యారని తెలిపారు. పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, త్యాగం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కామ్రేడ్ భూక్య వీరస్వామి మరణం పట్ల సీపీఐ ఖమ్మం జిల్లా దండి సురేష్, తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దంతాల బాలరాజు, మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, సిపిఐ కాకరవాయి గ్రామ కార్యదర్శి భూక్య శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జిల్లా వెంకన్న, ఒకటవ వార్డు సభ్యులు అన్నం రజిత,నల్లగట్టు సామేలు, వీరబోయిన మధు, నల్లగట్టు రవి, అన్నం రమణారెడ్డి,కొలిశెట్టి నర్సయ్య,కార్యకర్తలు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని మౌలానా ఆకాంక్షించారు.



# నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన వ్యక్తి.. కామ్రేడ్ భూక్య వీరస్వామి..

**కాకరవాయి సర్పంచ్ గూడూరు ఉపేందర్..**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** కమ్యూనిస్టు భావజాలాన్ని తన జీవన విధానంగా మార్చుకుని, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితమై పని చేసిన కామ్రేడ్ భూక్య వీరస్వామి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని కాకరవాయి గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్ పేర్కొన్నారు. గురువారం కాకరవాయి గ్రామంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో ఆయన కామ్రేడ్ భూక్య వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఉపేందర్ మాట్లాడుతూ, కామ్రేడ్ భూక్య వీరస్వామి తన జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి, వాటికి కట్టుబడి ప్రజల కోసం పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు. కార్మికులు, రైతులు, నిరుపేదల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి, ప్రజలను చైతన్యపరిచిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం ఎలాంటి లాభనష్టాలను పట్టించుకోకుండా ముందుకు సాగిన వ్యక్తిత్వం ఆయనదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు చివరి వరకు శ్రమించారని తెలిపారు. ఒకవైపు తాను విశ్వసించిన కమ్యూనిస్టు భావజాలాన్ని, మరోవైపు తన కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రెండింటినీ సమన్వయం చేసిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ భూక్య వీరస్వామి అని ఉపేందర్ పేర్కొన్నారు.గ్రామ స్థాయి నుంచి తెలంగాణ ఉద్యమ స్థాయి వరకు ప్రజా సమస్యలపై ఆయన చూపిన చొరవ, యువతలో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం, కార్మిక హక్కుల కోసం చేసిన పోరాటాలు ఆయనను ప్రజల మనసుల్లో నిలిపాయని అన్నారు. కామ్రేడ్ భూక్య వీరస్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని, ఆయన చూపిన మార్గంలో ప్రజల కోసం పని చేయడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ్ ఉపేందర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భూక్యా ఆంజనేయులు, గూడూరు ఉమామహేశ్వర్,దంతలా మల్సుర్,గుండాల లింగయ్య భూక్యా వీరస్వామి, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొని కామ్రేడ్ భూక్య వీరస్వామికి నివాళులు అర్పించారు.

# బాధ్యతాయుత జర్నలిజమే లక్ష్యం



- 'మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్' ఫెలోషిప్ ప్రారంభం

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** విలువలతో కూడిన జర్నలిజం సమాజానికి అత్యవసరమని జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ అజ్ హరుద్దీన్ అన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర శాఖ ప్రకటించిన 'మౌలానా అబ్దుల్ బాసిత్ అన్వర్ జర్నలిజం ఫెలోషిప్ 2025' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనాబ్ ముహమ్మద్ అజ్ హరుద్దీన్ మాట్లాడుతూ, నేటి సమాజంలో జర్నలిజం రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. కేవలం సమాచారాన్ని అందించడమే కాకుండా, నైతిక విలువలతో కూడిన బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు విద్యార్థులను ప్రేరేపించడమే ఈ ఫెలోషిప్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. యువ జర్నలిస్టులు సమాజ హితాన్ని కాంక్షిస్తూ తమ వృత్తిని మలచుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అర్హతలు దరఖాస్తు వివరాలు: జె.ఐ. హెచ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎం. ఫసిఉల్లా ఫెలోషిప్ నిబంధనలను వివరించారు:

అర్హత: తెలంగాణలోని కాలేజీలు, వర్సిటీల్లో జర్నలిజం (యూజీ, పేజీ, డిప్లొమా) చదువుతున్న ముస్లిం విద్యార్థులు. కనీసం ఒక సెమిస్టర్ పూర్తి చేసి ఉండాలి.

ఎంపిక: ప్రతిభ ఆధారంగా ఎంపికైన వారికి రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఫెలోషిప్ అందజేస్తారు.

గడువు: ఆసక్తి గలవారు డిసెంబర్ 31, 2025 లోపు క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

వివరాలకు: 9948011372 నంబర్‌ను సంప్రదించగలరు.

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం



మందుముల పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, డిసెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** సీఎంఆర్ఎఫ్ పేదలు, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ కింద వైద్య బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మికి రూ.26 వేలు, సహినా సుల్తానాకు రూ.57 వేలు, నరసింహకు రూ.25 వేలు, సక్కుబాయి తరణికి రూ.41 వేలు చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, ఆగం రెడ్డి, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎండి.రఫిక్, హెచ్.ఆర్. మోహన్, బజార్ నవీన్ గౌడ్, బుల్లెట్ అశోక్, అఫ్జల్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి ఆధ్వర్యంలో భూక్య వీరస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం..



**ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 18(తెలంగాణ ముచ్చట్లు):** తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందిన భూక్య వీరస్వామి కుటుంబానికి ఏఐటియుసి ఆధ్వర్యంలోని భవన నిర్మాణ కార్మికులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన ఏఐటియుసి నాయకులు, కార్మికుల సహకారంతో రూ.7 వేల నగదు సేకరించి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ.. భూక్య వీరస్వామి మృతి కార్మిక లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారని, ఈ కష్టసమయంలో కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మిక కుటుంబాలకు ఏఐటియుసి ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు, ఏఐటియుసి నాయకులు పాల్గొని భూక్య వీరస్వామి కుటుంబానికి ధైర్యం చెప్పి పరామర్శించారు. కార్మికుల ఐక్యతతోనే ఇలాంటి సహాయ కార్యక్రమాలు సాధ్యమవుతాయని వారు పేర్కొన్నారు. కష్టకాలంలో కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించడమే ఏఐటియుసి లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నల్లగట్టు సామెలు, నల్లగట్టు రవి, నల్లగట్టు జనర్ధన్, కొంగల రవి, మందుల శ్రీను, నల్లగట్టు ఇదయ్య, నల్లగట్టు శ్రీను(పిరయ్య ), నల్లగట్టు శ్రీను( ఎర్ర ), నల్లగట్టు సురేష్, నల్లగట్టు కిరణ్, నల్లగట్టు వెంకన్న, దోసపాటి మైసయ్య, ఇరుగు కృష్ణ, నల్లగట్టు అంబేద్కర్, నల్లగట్టు సామ్రాట్, మేడి వెంకటేష్, భానోత్ మంగు (రేకుల తండా ), నకిరేకంటి సుధాకర్, నల్లగట్టు నాగేష్(మలక ), నల్లగట్టు నాగార్జున్, నల్లగట్టు నాగన్న, చిలక సత్యం, నల్లగట్టు లింగయ్య తదితరులు పాల్గొన్నారు..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఆ పదిమందిని బీఆర్ఎస్ ఆహ్వానించాలి!

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా.. కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి. హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడిరది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడిరది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చకపోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బిఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# మహిళా కార్మికులది ధర్మ పోరాటం

- యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలి
- కార్మిక శాఖా మంత్రి జోక్యం చేసుకోవాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు



గత 11రోజులుగా షాహీ ఎక్స్‌పోర్ట్ మహిళా కార్మికులు తమ వేతనాలు పెంచాలని చేస్తున్న ధర్మ పోరాటం పై కార్మిక శాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని చర్చలు జరిపి వేతనాలు పెంచి సమ్మెను విరమింపచేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారుగురువారం నాచారం షాహి ఎక్స్ పోర్ట్ కంపెనీ ఎదుట బైఠాయించి నిరవధిక సమ్మె చేస్తున్న మహిళా కార్మికులకు కెవిపిఎస్ నాయకత్వం సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది . సమ్మెలో ఉన్న మహిళా కార్మికులనుద్దేశించి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ నిజాం కాలం నాటి వెట్టిచాకిరి షాహీ కంపెనీలో కొనసాగుతుందన్నారు.నిత్యావసరజిధరలు పెరుగుతున్నప్పటికీ కార్మికులకు వేతనాలు పెంచడం లేదన్నారు కంపెనీ లోని సూపర్ వైజర్లు ఇతర విభాగాలలో ఉన్న వారి వేతనాలు పెంచుతున్న యాజమాన్యం మహిళా కార్మికుల పట్ల మాత్రం వివక్ష ప్రదర్శిస్తుందన్నారు రోజుకు కేవలం 300 రూపాయలతో కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు? ఏదైనా అనారోగ్య కారణాల రీత్యా కంపెనీకి రాకపోతే 800 రూపాయలు కట్ చేస్తున్నారని చెప్పారు జీతం మాత్రం రోజుకు 300 ఇస్తున్నారని చెప్పారు సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఒక కార్మికుడికి నెలకు 26,400 కనీస వేతనం ఇవ్వాలన్నారు కానీ కార్మికులు కేవలం 16 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు మహిళా కార్మికులను ఏ మాత్రం యాజమాన్యం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి జి వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకొని కార్మిక శాఖకు ఆదేశాలు ఇచ్చి తక్షణమే వేతనాలు పెంచి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు .కంపెనీ యజమాన్యం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కుట్ర చేస్తుందని సమ్మెను పరిష్కరించడానికి ప్రయత్నం చేయడం లేదని చెప్పారు మహిళా కార్మికులు నిండు చలిలో ఎండలో రోడ్డుపై బైఠాయించి నానా రకాల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు 11 రోజులైనా పట్టించుకోకపోవడం యాజమాన్యం మొండివైఖరికి నిదర్శనం అన్నారు తక్షణమే కార్మిక శాఖ అధికారులు చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు సమ్మెలో గొంతెమ్మ కోర్కెలు లేవని బంజారాహిల్స్ లో బంగ్లా కావాలని జూబ్లీహిల్స్ లో ఫ్లాట్ కావాలని సూపర్వైజర్లకు ఉన్న జీవితం తమకు ఇవ్వాలని మహిళా కార్మికులు కోరడం లేదన్నారు తమ కుటుంబ పోషణ కాస్తయినా మెరుగుగా సాగాలంటే వేతనాలు పెంచాలన్నారు ధర్మ పోరాటం న్యాయబద్ధంగా చేస్తున్న సమ్మె అన్నారు మహిళా కార్మికుల న్యాయమైన సమ్మెకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెను కొనసాగించాలన్నారు సమ్మె విచ్ఛిన్నం కోసం యాజమాన్యం చేస్తున్న కుట్రలను ఐక్యంగా ప్రతిఘటించాలని చెప్పారు .ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాల పీరు జిల్లా నాయకులు స్వామి, శ్రీను భాగ్య ,గోపి ,మధు తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం

**వేలేరు,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ కొట్టివేయడంతో, తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ మారలేదని కడియం శ్రీహరి ఇచ్చిన వివరణపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

ఈ సందర్భంగా గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు "ప్రజలను ఎన్నాళ్లు మోసం చేస్తారు?" అంటూ నినాదాలు చేశారు. కడియం కావ్యను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రచారం చేసిన విషయం ప్రజలకు తెలిసిందేనని, ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని విమర్శించారు. ఇది నియోజకవర్గ అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయమా? లేక ప్రజలను తప్పుదారి పట్టించడానికా? అని ప్రశ్నించారు.

మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తాము ఏ పార్టీలో ఉన్నామో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని మండిపడ్డారు. అబద్ధపు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడం సరికాదని అన్నారు. దమ్ముంటే తెలంగాణ భవన్‌కు వెళ్లి కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి, రాజీనామా చేసి బీఆర్ఎస్ కండువా కప్పుకుని రావాలని సవాల్ విసిరారు. అప్పుడు మాత్రమే బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతిస్తాయని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పోలు తిరుపతి, మారబోయిన రాజు, కొయ్యడా మహేందర్, ఎండీ హారీఫ్, జంపయ్య, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సోడాషాపల్లి శివారులో వ్యక్తిని ఢీకొన్న డీసీఎం

**పౌల్ట్రీ ఫామ్ సూపర్‌వైజర్‌కు తీవ్ర గాయాలు**

**వేలేరు,డిసెంబర్18(తెలంగాణ ముచ్చట్లు):**వేలేరు మండలం సోడాషాపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన షాతావాహన పౌల్ట్రీ ఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న మేకల శ్రీకాంత్ విధుల నిమిత్తం వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు తలతో పాటు చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనం వివరాలను సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు.

# కుషాయిగూడ డివిజన్ ఏర్పాటును అడ్డుకునేందుకు కుట్రలు



- కార్పొరేటర్ బొంతు శ్రీదేవిపై ఆరోపణలు
- కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి విమర్శ

**కుషాయిగూడ, డిసెంబర్ 18 (తెలంగాణ ముచ్చట్లు):** జీహెచ్ఎంసీ 16వ డివిజన్‌ను కుషాయిగూడ డివిజన్‌గా ఏర్పాటు కాకుండా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు, కుతంత్రాలు చేశారని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆరోపించారు. డివిజన్ పరిధిలో ఇళ్ల నిర్మాణాల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతూ "వసూల్ రాణి"గా అవతారం ఎత్తారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్‌ల పునర్విభజనలో కుషాయిగూడ డివిజన్ ఏర్పాటు దాదాపు ఖరారైన నేపథ్యంలో గురువారం కుషాయిగూడ బస్టాండ్ ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు.ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్‌లో దోపిడీ సరిపోక కుషాయిగూడ డివిజన్ ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. 80 గజాల స్థలంలో ఇల్లు కట్టుకున్నా వదలకుండా లక్షల రూపాయలు కప్పంగా వసూలు చేశారని, గుడిలో అర్చకత్వం చేసే పురోహితులను కూడా వదలలేదని అన్నారు. లక్ష్మీనరసింహ కాలనీలో పేద యాదవ కుటుంబం నుంచి సుమారు రూ.75 వేల వరకు వసూలు చేసిన ఘటనను గుర్తు చేశారు.వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆధారమైన కుషాయిగూడ ప్రాంతాన్ని పదేళ్లుగా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. ఇకనైనా కుట్రలు మానకపోతే చాయ్‌పే చర్చ కార్యక్రమాలతో ముందుకు సాగుతూ అవినీతి బండారాన్ని సాక్షాధారాలతో బయటపెడతామని హెచ్చరించారు.చర్లపల్లి కాలనీల సమాఖ్య (సీసీఎస్) అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి మాట్లాడుతూ, ఒకవైపు కుషాయిగూడ డివిజన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మరోవైపు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు.ఈ సమావేశంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్‌తో పాటు వివిధ కాలనీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# బిజెపి కార్యాలయం ముందు ధర్నాకు కాంగ్రెస్ నాయుకుల యత్నం

## గాంధీభవన్ గేట్లు మూసేసిన పోలీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, అగ్రనేత రాహుల్ గాంధీను ఇడి కేసులతో వేధిస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఎఐసిసి పిలుపు మేరకు టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీభవన్ నుంచి బిజెపి కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరిగింది. బిజెపి కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయుకులు ధర్నా తల పెట్టారు. వివిధ జిల్లాల నుంచి గాంధీభవన్‌కు భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు. గాంధీభవన్ వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించారు. నిరసన పాల్గొంటున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. గాంధీభవన్ గేట్లు పోలీసులు మూసేయడంతో గాంధీభవన్ గేట్లు దాటేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## తుమ్మును బలవంతంగా ఆపొద్దు!

తుమ్ములు రావడం అనేది ఒక సహజ పక్రియ. దాదాపు ప్రతి ఒక్కరికీ రోజులో ఒక్కసారైనా తుమ్ములు వస్తుంటాయి. అందరూ తుమ్మడం సాధారణం. అయితే కొంతమంది మాత్రం ఉదయం నిద్రలేచిన వెంటనే బిగ్గరగా తుమ్మడం ప్రారంభిస్తారు. తుమ్ములు రావడం అనేది ఒక సహజ పక్రియ. దాదాపు ప్రతి ఒక్కరికీ రోజులో ఒక్కసారైనా తుమ్ములు వస్తుంటాయి. అందరూ తుమ్మడం సాధారణం. అయితే కొంతమంది మాత్రం ఉదయం నిద్రలేచిన వెంటనే బిగ్గరగా తుమ్మడం ప్రారంభిస్తారు. జలుబు, ఫ్లూ, అలెర్జీ ఉన్నవారికి ముక్కులోకి దుమ్ము కణాలు ప్రవేశించినప్పుడు తుమ్ము వస్తుంది. ఈ తుమ్ములు శరీరం సహజ పక్రియ. ఇది ఒక వ్యాధి కాదు. కాబట్టి తుమ్ములు ఎందుకు వస్తాయి? దాని వెనుక ఉన్న శాస్త్రీయ కారణం ఏమిటి? తుమ్ము అనేది శరీరాన్ని రక్షించే పక్రియ. అవును.. తుమ్ములు మన శరీరాన్ని సురక్షితంగా ఉంచడానికి రూపొందించబడిన జీవసంబంధమైన సంఘటనల గొలుసు. ఇది ప్రకృతిలో అత్యంత వేగవంతమైన, తెలివైన రక్షణ విధానాలలో ఒకటి. ఇది బ్యాక్టీరియా, దుమ్ము, ఇతర సూక్ష్మ కణాలను శ్వాసకోశ వ్యవస్థలోకి లోతుగా చొచ్చుకుపోకుండా ముక్కు నుంచి బయటకు పంపుతుంది. బాక్టీరియా, ధూళి కణాలు, పెంపుడు జంతువుల చర్మం లేదా ఇతర గాలిలో కలిసిన కణాలు ముక్కులోకి ప్రవేశించినప్పుడు శరీర రోగనిరోధక వ్యవస్థ సక్రియం అవుతుంది. ఇది ఈ హానికరమైన కణాలను ముప్పుగా భావించి హిస్టామిన్ అనే రసాయనాన్ని విడుదల చేస్తుంది. ఇది మీ ముక్కు లైనింగ్‌ను చికాకుపెడుతుంది. దీని వల్ల మీరు తుమ్ముతారు. మీరు తుమ్మినప్పుడు, మీ ముక్కులోకి ప్రవేశించిన కణాలు బయటకు వస్తాయి. తుమ్ము అనేది బ్యాక్టీరియా, పుప్పొడి, ధూళి వంటి కణాలను ముక్కు నుంచి తొలగించే శరీర రక్షణ యంత్రాంగం.

# పోషకాలు అందాలంటే పచ్చిగా తినాల్సిందే

ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు తమ ఆహారంలో రకరకాల కూరగాయలను భాగం చేసుకుంటారు. అయితే, కూరగాయలు వండుకుని తినడం వల్ల వాటిలోని పోషకాలు గరిష్టంగా శరీరానికి అందుతాయని చాలామంది భావిస్తారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు తమ ఆహారంలో రకరకాల కూరగాయలను భాగం చేసుకుంటారు. అయితే, కూరగాయలు వండుకుని తినడం వల్ల వాటిలోని పోషకాలు గరిష్టంగా శరీరానికి అందుతాయని చాలామంది భావిస్తారు. కానీ, ఆరోగ్య నిపుణులు, శాస్త్రవేత్తలు చెబుతున్న దాని ప్రకారం.. కొన్ని కూరగాయలను వండటం వల్ల, ముఖ్యంగా అధిక వేడికి గురి చేయడం వల్ల వాటిలోని కీలకమైన పోషకాలు, ఎంజైమ్‌లు గణనీయంగా తగ్గిపోతాయి. అందుకే, వాటి పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, ఆ కూరగాయలను పచ్చిగా తినడమే మంచిదని సలహా ఇస్తున్నారు. రెడ్ బెల్ పెప్పర్‌లో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడానికి, చర్మ ఆరోగ్యానికి చాలా కీలకం. అయితే, అధిక వేడికి గురైనప్పుడు ఇందులోని విటమిన్ సి స్థాయిలు చాలా వరకు పడిపోతాయి. ఉడకబెట్టినా, ఆవిరి చేసినా పోషకాలు కోల్పోతాయి. అందుకే రెడ్ బెల్ పెప్పర్‌ను సలాడ్‌ల రూపంలో పచ్చిగా తిన్నప్పుడే గరిష్ఠ స్థాయిలో విటమిన్ సి, ఇతర





పోషకాలు శరీరానికి అందుతాయి. బ్రొకోలీని కేన్సర్‌తో పోరాడే ఆహారంగా పరిగణిస్తారు. దీనికి కారణం, ఇందులో ఉండే ప్రత్యేకమైన మైరోసినేస్ అనే ఎంజైమ్. అధిక వేడిలో ఈ ఎంజైమ్ నిష్క్రియంగా మారిపోతుంది. దాంతో, బ్రొకోలీలోని కేన్సర్ నిరోధక గుణాలు శరీరానికి అందకుండా పోతాయి. వండిన బ్రొకోలీతో పోలిస్తే.. పచ్చి బ్రొకోలీలోనే సల్ఫోరాఫేన్ అనే యాంటీ ఆక్సిడెంట్ 10 రెట్లు ఎక్కువగా లభిస్తుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు, సల్ఫ్యూరిక్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. వెల్లుల్లిని వేడి చేయడం వల్ల ఇందులోని ముఖ్యమైన సమ్మేళనాలైన అల్లిసిన్, ఆర్గానోసల్ఫర్ పాక్షికంగా నాశనం అవుతాయి. అందువల్ల వెల్లుల్లి పూర్తి ప్రయోజనాలు అందాలంటే, దానిని పచ్చిగా తినడమే ఉత్తమం. ఉల్లిపాయల్లో క్వెర్సెటిన్ అనే ఫ్లేవనాయిడ్ మరియు సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. ఎక్కువసేపు వేడి చేసినప్పుడు ఉల్లిపాయల్లోని క్వెర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు దెబ్బతింటాయి. సాధారణ వంట పద్ధతుల్లోనూ కొన్ని ఫ్లేవనాయిడ్లు తగ్గుతాయని పరిశోధకులు గుర్తించారు. అందువల్ల పచ్చి ఉల్లిపాయలను సలాడ్‌లు లేదా డ్రెస్సింగ్‌లలో తీసుకుంటే అధిక స్థాయిలో ఫైటోన్యూట్రియెంట్లు శరీరానికి అందుతాయి. మనం తినే ఆహారం పూర్తి ఆరోగ్య ప్రయోజనాలను అందించాలంటే, ఈ కూరగాయలను పచ్చిగా తినే అలవాటు చేసుకోవడం మంచిది.



# ఆవాలతో ఆరోగ్య ప్రయోజనాలు..

మన వంటకాల్లో, ముఖ్యంగా పోపు దినుసుల్లో ఆవాలకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ఆవాలు అంటే నల్లగా ఉండే చిన్న గింజలే మనకు గుర్తొస్తాయి. కానీ, మార్కెట్‌లో నలుపుతో పాటు తెల్ల ఆవాలు కూడా ఉంటాయని చాలామందికి తెలియదు. మన వంటకాల్లో, ముఖ్యంగా పోపు దినుసుల్లో ఆవాలకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ఆవాలు అంటే నల్లగా ఉండే చిన్న గింజలే మనకు గుర్తొస్తాయి. కానీ, మార్కెట్‌లో నలుపుతో పాటు తెల్ల ఆవాలు కూడా ఉంటాయని చాలామందికి తెలియదు. ఇవి పూర్తిగా తెల్లగా కాకుండా, కాస్త క్రీమ్ రంగులో ఉంటాయి. నల్ల ఆవాల మాదిరిగానే తెల్ల ఆవాలలో కూడా అనేక పోషకాలు నిండి ఉన్నాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే, కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక రకాల వ్యాధులను నయం చేయడానికి కూడా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తెల్ల ఆవాలు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. తెల్ల ఆవాలను ఆహారంలో చేర్చుకుంటే, నోటిలో లాలాజలం, జీర్ణ రసాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల మనం తీసుకున్న ఆహారం, ముఖ్యంగా ప్రోటీన్లు, కొవ్వులు సులభంగా జీర్ణం అవుతాయి. ఆకలి లేనివారు వీటిని తింటే మంచి ఫలితం ఉంటుంది. జ్వరం లేదా ఏదైనా అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత నోరు చేదుగా ఉండి ఆహారం తినాలనిపించకపోతే, తెల్ల ఆవాలు ఆ సమస్యను తగ్గిస్తాయి. అంతేకాక, వీటిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి, తెల్ల ఆవాలు జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, మలబద్ధకం సమస్యను దూరం చేస్తాయి.తెల్ల ఆవాలు షుగర్ మరియు రక్తపోటు ఉన్నవారికి చాలా మేలు చేస్తాయి. తెల్ల ఆవాలలో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇది నాడీ మండలం పనితీరును మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా, నిద్రలో కాలి పిక్కలు పట్టేయడం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మెగ్నీషియం రక్తంలోని షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే, వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది, తద్వారా అధిక రక్తపోటు సమస్య అదుపులో ఉంటుంది. ఈ తెల్ల ఆవాలలో క్యాల్షియం కూడా అధిక మొత్తంలో ఉంటుంది, ఇది ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాక, తెల్ల ఆవాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. వీటిని వాడటం వల్ల కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు మరియు వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఇది చాలా మంచిది. ఈ గింజల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి సహజ సిద్ధమైన యాంటీబయాటిక్‌గా పనిచేసి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి, తద్వారా ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తెల్ల ఆవాలను పొడి రూపంలో తయారుచేసి రోజువారీ ఆహారంలో కాస్త తీసుకుంటే, ఈ ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.




# లిఫ్ట్‌కి బదులు మెట్లు వాడండి

## ఊహించని ఫిట్‌నెస్

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఫిట్‌గా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. ఊబకాయం సమస్య పెరుగుతున్న ఈ రోజుల్లో, చాలామంది జిమ్‌కు వేలకు వేలు ఖర్చు పెట్టలేక, కఠినమైన ఆహార నియమాలు పాటించలేక నిరాశకు గురవుతున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఫిట్‌గా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. ఊబకాయం సమస్య పెరుగుతున్న ఈ రోజుల్లో, చాలామంది జిమ్‌కు వేలకు వేలు ఖర్చు పెట్టలేక, కఠినమైన ఆహార నియమాలు పాటించలేక నిరాశకు గురవుతున్నారు. అయితే, ఖర్చు లేకుండా, ప్రత్యేకంగా సమయం కేటాయించకుండానే అత్యంత ప్రభావవంతమైన ఫలితాలను ఇచ్చే ఒక సులభమైన వ్యాయామం ఉంది, అదే మెట్లు ఎక్కడం. లిఫ్ట్‌లకు, ఎస్కలేటర్‌లకు అలవాటు పడిపోయిన మనం.. మెట్లు ఎక్కడం అనే చిన్న అలవాటును తిరిగి జీవితంలోకి తీసుకొస్తే, ఆరోగ్యంలో అద్భుతమైన మార్పులు కనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మెట్లు ఎక్కడం అనేది గుండె ఆరోగ్యానికి, కండరాల బలానికి అత్యంత శక్తివంతమైన వ్యాయామంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని అనేక ప్రధాన కండరాలు ఒకేసారి పనిచేసేలా చేస్తుంది. ముఖ్యంగా కాళ్ల కండరాలు బలంగా మారతాయి, ఇది శరీరానికి చురుకుదనం పెంచుతుంది. సాధారణ నడకతో పోలిస్తే, మెట్లు ఎక్కడం అనేది ఎక్కువ శక్తిని ఖర్చు చేసే ఇంటెన్స్ కార్డియో వ్యాయామం. ఇది మీ హృదయ స్పందన రేటును పెంచుతుంది, తద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికి మెట్లు ఎక్కడం ఒక అద్భుతమైన వ్యాయామంగా పనిచేస్తుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం, కేవలం ఆరు నిమిషాల పాటు నిరంతరాయంగా మెట్లు ఎక్కడం వల్ల కూడా శరీరంలోని కొవ్వు శాతాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తేలింది.అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నవారు, రోజుకు కేవలం 30 నిమిషాలు మెట్లు ఎక్కే అలవాటు చేసుకుంటే, సుమారు 250 నుంచి 300 కేలరీల వరకు ఖర్చు చేయవచ్చు. క్రమం తప్పకుండా ఈ వ్యాయామం చేయడం ద్వారా శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు క్రమంగా కరుగుతుంది. ప్రత్యేకంగా జిమ్‌లకు వెళ్లడానికి సమయం కేటాయించలేని బిజీ వ్యక్తులకు మెట్లు ఎక్కడం ఒక వరం లాంటిది. రోజువారీ పనుల్లో భాగంగానే మీరు ఈ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవచ్చు. ఆఫీసులో లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఉపయోగించడం, అపార్ట్‌మెంట్లలో ఇంటికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మెట్లు ఎక్కడం వంటి చిన్న మార్పులు దీర్ఘకాలంలో మీ ఆరోగ్యంపై పెద్ద సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. మెట్లు ఎక్కడం అనేది కేవలం కేలరీలు ఖర్చు చేయడమే కాదు, మీ రోజువారీ జీవితానికి చురుకుదనాన్ని జోడిస్తుంది. కాబట్టి, ఇకనుంచి మెట్లను ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

# ఔషధాల గని లవంగం



లవంగాలు కేవలం సుగంధ ద్రవ్యాలు మాత్రమే కావు, ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ గుణాల గని. రాత్రి పడుకునే ముందు లవంగాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది, రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ప్రశాంతమైన నిద్రను ప్రోత్సహిస్తూ, జలుబు, దగ్గు, నోటి సమస్యల నుండి ఉపశమనం అందిస్తాయి. గుండె ఆరోగ్యానికి కూడా ఇవి తోడ్పడతాయి. అత్యంత ముఖ్యమైన సుగంధ ద్రవ్యాలలో ఒకటైన లవంగాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వైద్య నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఈ రోజు తెలుసుకుందాం. లవంగాలు ఆహారానికి రుచిని మాత్రమే కాకుండా, వాటిలోని ఔషధ గుణాలతో మన ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు లవంగాలు తీసుకోవడం లేదా లవంగం నీరు తాగడం వల్ల శరీరంలో అనేక సానుకూల మార్పులు చోటు చేసుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. పడుకునే ముందు లవంగాలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు సూపర్‌గా మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, ఉబ్బరం వంటి సాధారణ జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. లవంగాలలో ఉండే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా, ఇవి శ్వాసవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, అలాగే నోటి ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. లవంగాలు ఫైబర్, మాంగనీస్, పొటాషియం, కాల్షియం, విటమిన్ కె వంటి ఖనిజాలు, విటమిన్లతో పాటు ఫ్లేవనాయిడ్స్, యూజినాల్ వంటి ముఖ్యమైన కర్బన సమ్మేళనాలను కలిగి ఉంటాయి. అందుకే ఆయుర్వేద నిపుణులు రాత్రి నిద్రపోయే ముందు లవంగాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. లవంగాలు మెదడును ప్రశాంతపరిచే సహజ పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని తినడం వల్ల ఒత్తిడి తగ్గి, మంచి గాఢమైన నిద్రను పొందడానికి సహాయపడుతుంది. లవంగాలలోని ఔషధ గుణాలు శరీరం నుండి విషాన్ని సులభంగా తొలగించడంలో కూడా తోడ్పడతాయి. జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారికి లవంగాలు ఉపశమనం కలిగిస్తాయి. వీటిలోని వెచ్చదనం, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు గొంతు నొప్పి, దగ్గు, జలుబు, కఫం వంటి సమస్యల నుండి త్వరగా విముక్తి కలిగిస్తాయని చెబుతారు. నోటి ఆరోగ్యం విషయానికి వస్తే, లవంగాలు నమలడం వల్ల దుర్వాసన తగ్గుతుంది. ఇది పంటి నొప్పి నుండి తక్షణ ఉపశమనాన్ని అందించి, ఆరోగ్యకరమైన నోటిని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి కూడా లవంగాలు మేలు చేస్తాయి. లవంగం నీరు శరీరంలో రక్త ప్రసరణ పక్రియను మెరుగుపరచడంలో సహాయపడి, తద్వారా గుండె పనితీరును కూడా తోడ్పడుతుంది. లవంగాల నీటిని తయారుచేయడం చాలా సులభం. ముందుగా ఒక కప్పు నీటిలో మూడు లేదా నాలుగు లవంగాలను కలిపి ఉంచండి. నానబెట్టిన లవంగాలను మీడియం మంట మీద ఐదు నిమిషాలు మరిగించండి. ఆ తర్వాత నీటిని చల్లబరచండి. పడుకునే 30 నిమిషాల ముందు ఈ నీటిని పరిమిత పరిమాణంలో తాగాలి. అయితే లవంగాలు వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి కావున, వీటిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. అలాగే, ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లవంగాలను ఆహారంలో చేర్చుకునే ముందు వైద్యులను సంప్రదించడం ఇంకా ఉత్తమం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్నచెలలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ`లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.




# ధురంధర్‌తో సత్తా చాటిన అక్షయ్ ఖన్నా

'ధురంధర్' వంటి సూపర్ హిట్ సినిమాతో సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా క్రేజ్ మరోసారి ఆకాశాన్ని తాకింది. రణవీర్ సింగ్ హీరోగా నటించిన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా రెహ్మాన్ డకైట్ అనే పవర్‌ఫుల్ నెగటివ్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విలన్ అయినప్పటికీ హీరోకంటే ఎక్కువ ప్రశంసలు దక్కడం ఆయన నటనకు నిదర్శనంగా మారింది. ప్రతి సీన్‌లో తనదైన స్టైల్, ఇంపాక్ట్‌తో మెరిసిన అక్షయ్ ఖన్నా 'ధురంధర్' సినిమాకు ప్రధాన బలంగా నిలిచారు. ఇదే ఏడాది ప్రారంభంలో విక్కీ కౌశల్ హీరోగా నటించిన 'చావా' సినిమాలో ఔరంగజేబు పాత్రలో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు
అందుకున్న ఆయన, ఇప్పుడు 'ధురంధర్'తో మరోసారి తన సత్తా చాటారు. కథ, పాత్ర ఏదైనా సరే.. తెరపై కనిపిస్తే తనదైన ముద్ర వేయడం అక్షయ్ ఖన్నాకే చెల్లింది అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.
ఇక సినిమాలతో పాటు అక్షయ్ ఖన్నా వ్యక్తిగత జీవితం కూడా తరచూ చర్చకు వస్తుంటుంది. ప్రస్తుతం ఆయన వయసు సుమారు 50 సంవత్సరాలు. అయినప్పటికీ ఇప్పటివరకు పెళ్లి చేసుకోలేదు. దీనిపై గతంలో ఓ మీడియా ఇంటర్వ్యూలో అక్షయ్ ఖన్నా చాలా స్పష్టంగా మాట్లాడారు. 'నాకు బాధ్యతలు వద్దు. నేను ఒంటరిగా ఉండటానికే ఇష్టపడతాను. ఎవరి గురించి ఆందోళన చెందకుండా నా జీవితాన్ని నేను ఆస్వాదించాలనుకుంటాను. నాకు ఇప్పుడు ఉన్న జీవితం చాలా బాగుంది. దాన్ని ఎందుకు మార్చుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. అక్షయ్ ఖన్నా ప్రముఖ బాలీవుడ్ నటుడు వినోద్ ఖన్నా కుమారుడు. 2025 నాటికి ఆయన మొత్తం ఆస్తులు సుమారు రూ.167 కోట్లుగా అంచనా వేయబడుతున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో బంగ్లాలు, విలాసవంతమైన కార్లు ఆయన సొంతం. సినిమాలతో పాటు రియల్ ఎస్టేట్ పెట్టుబడుల ద్వారా కూడా భారీగా సంపాదిస్తున్నారు. నటుడిగా, వ్యక్తిగా తనదైన మార్గంలో ముందుకు సాగుతున్న అక్షయ్ ఖన్నా, పెళ్లి లేకుండానే సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతూ బాలీవుడ్‌లో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటున్నారు. 'ధురంధర్' విజయంతో ఆయనకు మరిన్ని ఆసక్తికర పాత్రలు రావడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# రెండు ఓటిటిల్లోకి సంతాన ప్రాప్తిరస్తు





ప్రేమ, కెరీర్, రిలేషన్‌షిప్స్ మాత్రమే కాదు, ఈతరం చెప్పలేనంత సున్నితమైన సమస్యలతో కూడా సంఘర్షణ పడుతోంది. అందులో ఒకటి సంతాన లేమి. బయటికి మాట్లాడాలంటే సంకోచం, లోపల వేల సందేహాలు, వందల ఒత్తిడులు. అలాంటి సున్నితమైన విషయాన్ని కథగా మలచుకున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడి ఇదే చిత్రం తాజాగా రెండు ఓటీటీల్లో విడుదల కానుంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'జియో హాట్‌స్టార్'లో ఈ నెల 19 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చైతన్య (విక్రాంత్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఓ ఎగ్జామ్ సెంటర్ లో కల్యాణి (చాందిని చౌదరి) ను చూసి ప్రేమలో పడతాడు. ఇద్దరూ దగ్గరౌతారు. కల్యాణి తండ్రి ఈశ్వరరావు (మురళీధర్ గౌడ్) వీరి ప్రేమని వ్యతిరేకించడంతో ఇద్దరూ పారిపోయి పెళ్లి చేసుకుంటారు. త్వరగా బిడ్డని కనేస్తే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తాడు చైతు. కాకపోతే పిల్లల విషయంలో తన ప్రయత్నాలు ఫలించవు. దీంతో ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఆశ్రయిస్తాడు. వైద్య పరీక్షలు చేయించుకోగా చైతన్యకి ఓ సమస్య ఉన్నట్లు బయట పడుతుంది. తర్వాత ఏం జరిగింది? తన సమస్య కారణంగా చైతన్య ఎలాంటి పరిస్థితులు ఎదురుకున్నాడు? చివరకు చైతన్య, కల్యాణికి పిల్లలు పుట్టారా లేదా ?అనేది మిగతా కథ.




# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్

మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డిరపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా
సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ`లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# హద్దుమీరిన అభిమానం నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం



కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in